

జనగామలోని సబ్ జైలులో ఆర్జే టీవీ రిపోర్టర్‌ను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## జర్నలిస్టు రాజ్‌కుమార్ అరెస్టు అన్యాయం

- కేసు ఉపసంహరించుకోకుంటే ఆందోళన
- జనగామ సబ్ జైలులో బాధితుడిని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై రాష్ట్రంలోని గిరిజనులు, అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను యూట్యూబ్ చానల్ ద్వారా తెలియజేస్తున్న గిరిజన జర్నలిస్టు ఆర్జే టీవీ రాజ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తీవ్రంగా ఖండించారు. జనగామ సబ్ జైలులో ఉన్న జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను శనివారం ములాఖత్ ద్వారా వారు వేర్వేరుగా పరామర్శించారు. రాజ్‌కుమార్‌పై పెట్టిన కేసులు ఉపసంహరించుకొని వెంటనే విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆందోళనలు చేస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను యూట్యూబ్ చానల్ ద్వారా సోషల్ మీడియాలో పెడుతున్న రాజ్‌కుమార్‌ను అరెస్టుచేసి జైలులో పెట్టడం ప్రశ్నించే గొంతులను నొక్కడమేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజాభిప్రాయాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే ప్రభుత్వానికి మింగుడుపడడం లేదన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

## మావోయిస్టు నేత మచ్చ సోమయ్య లొంగుబాటు

- అతడిపై రూ.8 లక్షల రివార్డు: ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, జనవరి 11 : మావోయిస్టు నేత మచ్చ సోమయ్య (సమ్మయ్య) జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో లొంగిపోయినట్టు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి మండలం, పంబాపూర్ గ్రామానికి చెందిన మచ్చ సోమయ్య 32 సంవత్సరాలుగా మావోయిస్టు జిల్లా కమిటీ సెక్రటరీగా పని చేస్తున్నాడు. 1998లో గండి కామారం, 2002లో సింగారం – పందిపంపుల, 2018లో దూలేడు, 2024లో పాలగూడెంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నాడు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లో పలు కేసులు నమోదయ్యాయి. రూ.8లక్షల రివార్డు ఉందని, అతడికి అందజేయనున్నట్టు తెలిపారు. సీపీఐ (మావోయిస్ట్) సంస్థలో కొనసాగడానికి మచ్చ సోమయ్య ఆరోగ్యం సహకరించకపోవడం, వృద్ధాప్యం కారణంగా లొంగిపోవడానికి ఎర్రాల్ ఇన్‌చార్జిని అనుమతి కోరగా, ఆ ప్రతిపాదనను కేంద్ర కమిటీకి పంపగా అనుకూలంగా స్పందించారని తెలిపారు.

# సెల్ఫీ సరదాకు ఐదుగురు బలి

మొదటిపేజీ తరువాయి...



ధనుశ్



లోహిత్



దినేశ్వర్



సాహిల్ దీపక్ సుతార్



జతిన్

తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ఏడుగురు స్నేహితులు శనివారం సెలవు రోజు కావడంలో సరదాగా గడిపేందుకు సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లారు. తెల్లవారుజామునే తమతమ ఇండ్ల నుంచి బయలుదేరిన వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై బయలుదేరినవారంతా ముందస్తు ప్రణాళిక ప్రకారం ఒకే చోట కలుసుకున్నారు. స్కూటీలపై వెళ్తూ సరదాగా సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఆహ్లాదంగా ప్రాజెక్టుకు ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. కొండపోచమ్మ జలాలు, అక్కడి అందాలను చూసినవారంతా మురిసిపోయారు. నీళ్లలో దిగి సరదాగా ఫొటోలకు పోజులిచ్చారు. ఒకరిపై ఒకరు నీళ్లు చల్లుతూ జలకాలాటలు ఆడారు. ఈ క్రమంలోనే మరింత లోతుల్లోకి అనుకోకుండా వెళ్లిన ఏడుగురు గల్లంతయ్యారు. నీళ్లలో మునిగి వారిలో ఆచూకీ లభించకపోగా.. మరో ఇద్దరు అతికష్టంపై సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం తమ స్నేహితులు గల్లంతైన విషయాన్ని వారు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కానీ, దురదృష్టవశాత్తూ కొన్ని గంటల పాటు వెతికిన తర్వాత శనివారం రాత్రి ఐదుగురి మృతదేహాలు లభించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరిలో ముషీరాబాద్‌లోని ఇందిరానగర్‌కు చెందిన అన్నదమ్ములు గ్యార ధనుశ్(20), గ్యార లోహిత్(17), బన్సీలాల్‌పేటకు చెందిన చీకట్ల దినేశ్వర్(17), అత్తాపూర్‌కు చెందిన సాహిల్ దీపక్ సుతార్(19), ఖైరతాబాద్‌లోని చింతలబస్తీకి చెందిన ఉప్పల జతిన్(17) మృతిచెందడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. రాంనగర్‌కు చెందిన మిర్గనిక్ అలియాస్ మృగాంక్, ముషీరాబాద్‌కు చెందిన ఇబ్రహీం సురక్షితంగా బయటపడ్డారు.

### అందరిదీ పేద కుటుంబాలే

మృతులందరిదీ పేద, మధ్యతరగతి కుటుంబాలే కావడంతో బస్తీలు, కాలనీల్లో రోదనలు మిన్నంటాయి. ఇందిరానగర్‌కు చెందిన సోదరులు ధనుశ్, లోహిత్‌ల తండ్రి నర్సింగరావు ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్ద కుమారుడు ధనుశ్ తండ్రికి సాయంగా ఉండేవాడు. చిన్న కుమారుడు లోహిత్ డిప్లొమా రెండో సంవత్సరం చదువుతున్నాడు. చీకట్ల దినేశ్వర్ డిప్లొమా రెండో సంవత్సరం చదువుతుండగా, అతడి తండ్రి కిషన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సాహిల్ దీపక్ సుతార్ తల్లి అనిత వంట పని చేసుకుంటూ కుమారుడిని చదివిస్తున్నారు. సాహిల్ దీపక్ చదువుకుంటూనే ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. జతిన్ డిగ్రీ చదువుతుండగా, అతడి తండ్రి కోటేశ్వర్ ఆటో నడుపుతూ కుమారుడిని చదివిస్తున్నారు. కొండపోచమ్మ సాగర్‌లో పడి ప్రమాదవశాత్తు తమ పిల్లలు మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు.

### వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు...

కొండపోచమ్మ సాగర్‌లో హైదరాబాద్‌కు చెందిన యువకులు గల్లంతైన విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లాలోని ములుగు, మర్కూక్, గౌరారం పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. గత ఈతగాళ్ల సాయంతో శనివారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 7 గంటల సమయంలో ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాల నుంచి గజ ఈతగాళ్లను రప్పించగా.. మృతదేహాల గాలింపు చర్యలను సిద్దిపేట సీపీ అనురాధ పర్యవేక్షించారు. ఏసీపీలు పురుషోత్తంరెడ్డి, మధు, సీఐలు మహేందర్, లతీఫ్, సైదా, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు సైతం చెమటోడ్చారు. గాలింపు చర్యల్లో గత ఈతగాళ్లతో పాటు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గజ్వేల్ దవాఖాన వద్ద మృతుల కుటుంబ సభ్యులను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ప్రాజెక్టు వద్ద మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు ఎలక్షన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### కేసీఆర్ దిగ్భ్రాంతి

*హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): కొండపోచమ్మ సాగర్ జలాశయంలో దురదృష్టవశాత్తు నీట మునిగి ఐదుగురు యువకులు మరణించడం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన యువకులు ఈత రాకపోవడం వల్ల నిండుగా ఉన్న జలాశయంలో మునిగి ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. మరణించిన యువకుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.*

## యువకుల అకాల మరణం బాధాకరం

- రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలి కేటీఆర్, హరీశ్, కవిత

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు మునిగి ఐదుగురు యువకులు మరణించడం బాధకారమని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు అకాల మరణం చెందడం వారి కుటుంబానికి తీరని లోటని విచారణ వ్యక్తం చేశారు. తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దురదృష్టకరమైన ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొండపోచమ్మ సాగర్ దుర్ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆన్‌లైన్ గేమ్స్‌కు మరో యువకుడి బలి

- గేమ్స్ కోసం రూ.30 లక్షల అప్పు
- ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య
- వరంగల్ జిల్లాలో విషాదం



లైశెట్టి రాజు (ఫైల్)

వర్ధన్నపేట, జనవరి 11 : ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై మరో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్నది. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన లైశెట్టి కుమారస్వామి, సుజాత దంపతుల చిన్న కొడుకు రాజు(25) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. తెలిసిన వారి వద్ద సుమారు రూ.30 లక్షల వరకు అప్పు చేసి, ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టుకున్నాడు. తనకు మరో రూ.4 లక్షలు కావాలని నాలుగు రోజుల క్రితం తండ్రిని అడగ్గా లేవని చెప్పాడు. చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక, రెండు రోజులుగా మనోవేదనకు గురైన రాజు శనివారం తెల్లవారుజామున ఇంట్లోని స్లాబ్ కొక్కానికి చీరెతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ నేరగాళ్లకు చిక్కి.. డబ్బులు పోగొట్టుకొని

- వివాహిత ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

మరిపెడ, జనవరి 11 : ఓ వివాహిత సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. మరిపెడ మండలం గ్యామ తండాకు చెందిన గుగులోత్ శైలజకు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే ఒకటికి రెండింతలు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపారు. వారి మమాటలను గుడ్డిగా నమ్మిన ఆమె పలుమార్లు రూ.1.50 లక్షలకుపైగా నగదు బదిలీ చేసింది. కొంతవరకు తిరిగి రాగా.. ఆ తర్వాత తన పెట్టుబడి కూడా దక్కలేదు. మోసపోయానని తెలుసుకున్న శైలజ మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

## డాక్టర్ రమేశ్‌బాబుకు ఎఫ్‌ఐఏపీ అవార్డు



ఎఫ్ఐఏపీ అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమేశ్‌బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ దవాఖాన రిటైర్డ్ ఆర్ఎంవో, ప్రముఖ అడోలసెంట్ ఫిజీషియన్ డాక్టర్ రమేశ్‌బాబు దాంపురికి ప్రతిష్టాత్మకమైన 'ఫెలోషిప్ ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్'(ఎఫ్ఐఏపీ) అవార్డు దక్కింది. హైటెక్‌సిటీలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం జరిగిన 62వ జాతీయ ఐఏపీ సదస్సులో భాగంగా ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అధ్యక్షుడు డాక్టర్ వసంత్ ఖలట్కర్ చేతుల మీదుగా రమేశ్‌బాబు అవార్డు అందుకున్నారు. చిన్నపిల్లల ఆరోగ్యం, వైద్యంలో అధునాతన చికిత్సా పద్ధతుల్లో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. చిన్నపిల్లల్లో వచ్చే రోగాలకు ఆధునిక చికిత్సా పద్ధతుల కంటే జబ్బులను ఎలా కట్టడి చేయాలనే అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



మెదక్ జిల్లా టేక్మాల్‌లో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

## రైతులను మోసగించిన కాంగ్రెస్ సర్కార్

- స్థానిక ఎన్నికల్లో లబ్ధికోసమే రైతుభరోసా ప్రకటన
- ఎకరాకు 15 వేలు చెప్పి ప్రకటించింది రూ.12 వేలే
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధ్వజం

టేక్మాల్, జనవరి 11: అసెంబ్లీ ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని, స్వయంగా ఆరు గ్యారెంటీలను ప్రకటించిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీల మాటలు నీటి మూటలేనని తేలిపోయాయని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఎకరానికి రూ.10 వేల రైతుబంధు ఇవ్వగా, తాము ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని మాయమాటలతో రైతులను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రూ.15వేలకు బదులు రూ.12 వేలు ఇస్తామని రైతులకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా టేక్మాల్‌లో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చిన కాంగ్రెస్ అమలులో విఫలమైందని అన్నారు. మాయమాటలు చెప్పిన వారు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఇప్పటికి చాలా గ్రామాల్లో కాలేదని చెప్పారు. పార్టీ మాటలు నమ్మి మోసపోయామని కాంగ్రెస్ కార్యకర్తలే బాధపడుతున్నారని తెలిపారు. కేసీఆర్ రైతుబంధు వస్తలేదని, కేసీఆర్ కిట్టు వస్తలేదని, కల్యాణలక్ష్మి తులం బంగారం వస్తలేదని అన్నారు. ఆందోళనలో బీఆర్‌ఎస్ నేతలు జైపాల్‌రెడ్డి, నాగభూషణం, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో నీటి సమస్య తీర్చాలని కోరుతూ ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

## నీటికోసం రోడ్డెక్కిన మహిళలు

- ఖాళీ బిందెలతో నిరసన
- 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు

జగదేవపూర్, జనవరి 11: మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపిన ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలలో శనివారం చోటుచేసుకుంది. పదిహేను రోజులుగా నీళ్లు రాకపోవడంతో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని మహిళలకు నచ్చచెప్పారు. నీటి సమస్యను పరిష్కరిస్తామని భగీరథ ఏఈ హామీ ఇవ్వడంతో మహిళలు నిరసనను విరమించుకున్నారు.



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన మాజీ మంత్రి జోగు రామన్న, రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

## రైతు భరోసా 15 వేలు ఇవ్వాల్సిందే

**మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ • జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ రాస్తారోకో**

ఆదిలాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. రాస్తారోకోను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేసేంత వరకు బీఆర్‌ఎస్ ఆందోళనలు చేపడుతుందని అన్నారు. కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటుతో రైతులను ఆదుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్ నేతలను తిరగనివ్వబోని హెచ్చరించారు. రైతు భరోసా కింద ఎకరాకు 15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం ఇప్పుడు మాటతప్పి 12 వేలేనని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## వేతనాలివ్వాలని నిరసన

- పండుగపూట పస్తులేనా?
- పారిశుధ్య కార్మికుల ఆవేదన



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట దవాఖాన ఎదుట నిరసనలో నినదిస్తున్న కార్మికులు

అచ్చంపేట టౌన్, జనవరి 11 : ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ దవాఖాన ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన తెలిపారు. సంక్రాంతి పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు తలెత్తాయని వాపోయారు. వెంటనే జీతాలు చెల్లించేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## లోవోల్టేజీతో బోర్లు కాలిపోతున్నయ్

- కొల్సూర్ సబ్ స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

మాగనూరు, జనవరి 11: లోవోల్టేజీ సమస్యతో బోర్లు కాలిపోతున్నాయంటూ నారాయణపేట జిల్లా రైతులు ఆందోళనకు దిగారు. 3 నెలలుగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కొల్సూరు, మందిపల్లి, పుంజనూరు, మూడుమాల్, గజ్రందొడ్డి గ్రామాల రైతులు శనివారం కొల్సూర్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌తో వాగ్వాదానికి దిగారు. సమస్య చెప్పినా స్పందనే లేదంటూ నిరసన తెలిపారు.



కొల్సూరు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు



కుభీర్‌లోని సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

## కరెంటు కోతలపై కర్షకుల కన్నెర్ర

- భైంసా -కుభీర్ రహదారిపై ధర్నా

కుభీర్, జనవరి 11 : విద్యుత్తు కోతలకు నిరసనగా నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట భైంసా–కుభీర్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. రహదారిని గంట సేపు దిగ్బంధించారు. శనివారం కుభీర్‌తోపాటు ఆయా గ్రామాల రైతులు ముందుగా సబ్ స్టేషన్ వెళ్లి కరెంట్ కోతలపై సిబ్బందిని నిలదీశారు. అనంతరం రోడ్డుపై ధర్నాకు దిగారు. వెంటనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపున్న రైతు నాయకులు

## రైతు భరోసా పేరిట సర్కార్ మోసం

- ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే
- తెలంగాణ రైతు రక్షణ సమితి డిమాండ్

ఎల్కతుర్తి, జనవరి 11: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు రక్షణ సమితి నాయకులు నిరసన తెలిపి మాట్లాడారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రైతుభరోసాలో కోతలు విధించడం సరికాదని అన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకు చెల్లించే బోనస్ రైతులకు పూర్తిగా అందడం లేదని వాపోయారు. కేసీఆర్ సర్కార్ కరోనా కష్టకాలంలోనూ రైతుబంధు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వెంటనే ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ పాల్గొన్నారు.



సాకిబండతండా రైతులతో మాట్లాడుతున్న ల్యాండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య. చిత్రంలో తహసీల్దార్ లలిత

## గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు ఇయ్యం

- అధికారులకు తేల్చిచెప్పిన సాకిబండ తండా వాసులు
- రోడ్డు వల్ల ఉపయోగం లేదన్న స్థానికులు

ఆమనగల్లు, జనవరి 11 : గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు తమ భూములు ఇచ్చేదిలేదని రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం సాకిబండ తండా రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో శనివారం ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లలిత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ల్యాండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య హాజరై రైతుల అభిప్రాయాలు సేకరించారు. అధికారులు తమ భూముల జోలికి రావొద్దని రైతులు తేల్చిచెప్పారు. కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి ఉన్నందున, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు వల్ల తమకు ఉపయోగం లేదని అన్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సర్వేకు సహకరించాలని రైతులను కోరారు. సమస్యలు ఏమైనా ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని చెప్పారు.